కథానిక

# శారద విశారద చదువు

"జ్యోతి"

శారద విశారద పరీక్షకు, హిందీ పుస్తకాలు ముందర వేసుకొని దీర్ఘంగా చదువుతోంది. ఇదివరకు రాష్ట్ర భాషలో లాగానే ఫస్టు క్లాసు రావాలని చాలా తంటాలు పడుతోంది. దూరంగా పడక కుర్చీలో కూర్చుని, ఫ్యాక్టరీ పొగలాగా పొగను వదుల్తున్నాడు తండ్రి.

"పోస్టు"

బయట కేక వినిపించింది. తండ్రి నోట్లో నుంచి చుట్టతీసి టెలిగ్రాం అందుకున్నాడు.

"ఫాదర్ ... సీరియస్ ... కమ్ షార్ట్ ... మూర్తి." టెలిగ్రాం చదువుకున్న తండ్రి, వరండాలో చదువుకుంటున్న కూతురుదగ్గరకు వచ్చి "అమ్మా! మీ మామగారికి చాలా సీరియస్‌గా వుందట. మీ ఆయన టెలిగ్రాం యిచ్చాడు" అన్నాడు.

హఠాత్తుగా విన్న వార్తకు జడిసి, నాన్నగారి వంక నోరు తెరుచుకొని చూసింది శారద. కొద్దిసేపాగి "బయలుదేరాలమ్మా!" అన్నాడాయన.

శారద బిత్తరపోయింది, మామగారిమీద అభిమానం లేక కాదు, ఆమెకింకా పరీక్షలు వారంరోజులే వున్నాయి.

తలవంచుకొని మెల్లగా అంది: "పరీక్షల మాట?"

"ఈసారి పరీక్షకు పోలేవమ్మా!"

క్రుంగిపోయింది శారద. ఎవ్వరికీ తెలియకుండా వెక్కి వెక్కి యేడ్చింది. ఫస్టుక్లాసు కోసం తానెంత కష్టపడ్డది?

శారదకు అత్తగారు లేదు. కృష్ణమూర్తి, అంటే శారద భర్త, యిప్పుడు బి. యస్. సి. నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. వారి యింటికి-వంటకత్తెగా అనటంకంటె-యజమానురాలుగా వచ్చింది కృష్ణమూర్తి మేనత్త. ఆవిడ రాకపోయివుంటే శారద యెప్పుడో అత్తవారింటికి రావలసింది. కోడలిని తీసుకువస్తే, కొడుకు చదువు చెడిపోతుందని, తండ్రి యీ మాటే తలపెట్టలేదు.

కృష్ణమూర్తి తండ్రికి యెదురు తిరిగి-చాలామంది చదువుకున్న యువకుల మాదిరిగా-భార్యను తెచ్చుకోలేకపోయాడు.

ఈ సంవత్సరం తాను యెలానూ పరీక్షలకు పోవడంలేదు కాబట్టి, అత్తవారింట్లో పదిహేను రోజులుంది శారద. కృష్ణమూర్తి తండ్రి చనిపోయాడు.

సంవత్సరం గిర్రునతిరిగింది. ఈసారి శారదకు తప్పకుండా మొదటి తరగతి వస్తుంది. సంవత్సరన్నర ఫలితం!

ఇంకా పరీక్షలు రెండు నెలలున్నాయనగా, మూర్తిదగ్గరనుంచి ఒక ఘోరమైన వుత్తరం వచ్చింది. మూర్తి మేనత్త చనిపోయిందట! శారదను వెంటనే తీసుకొని రమ్మని వ్రాశాడు. శారద మొదట చాలా భయపడ్డది కాని తన పరీక్షలింకా రెండు నెలలున్నాయనీ యీలోపుగా రావచ్చనీ అనుకొన్నది.

శారద రెండవ సంవత్సరం కూడా పరీక్షకు వెళ్ళలేదు. ఆమె యిప్పుడు అత్తవారింట్లో కాపురం చేస్తున్నది. ఇంటి పనంతా ఆమే చూచుకోవాలి. కాబట్టి చదువు సాగటమే లేదు.

కృష్ణమూర్తి బి. యస్. సి. తప్పాడు. శారద మొదట కొద్దిగా విచారించినా తరువాత కృష్ణమూర్తితో అంది, "వచ్చే యేడు మనమిద్దరం పరీక్షకు వెడదాం, ఇద్దరికీ క్లాసు రావాలి." మూర్తి చిరునవ్వు నవ్వాడు చిన్నపిల్లవాడిలా.

ఇప్పుడు శారదకు నాలుగో నెల. ఆమె పని యెక్కువ చేయడం లేదు. పరీక్షలు ఐదు నెలలు వున్నయ్. పనిలేదు కాబట్టి చదువుకో వచ్చు. కాని యిది అడ్డం వచ్చింది.

"ఈసారి కూడా పరీక్షకు పోవడానికి వీలులేదుగా!"

"ఏమో! అది నీకే తెలియాలి."

"కూర్చోలేనేమో."

"పోనీ వచ్చే యేడు కూర్చోవచ్చు. చదువు."

పరీక్షలు వచ్చినయ్. పోయినయ్. రిజల్ట్సు కూడా వచ్చినయి. మూర్తి బి. యస్. సి. మొదటి తరగతిలో నెగ్గాడు.

"ఈసారి నువ్వు పరీక్షకు పోతే యూనివర్సిటీ ఫస్టు సర్టిఫికేటు వచ్చేది."

"ఇచ్చారుగా యీ సర్టిఫికేటును." కొడుకును హృదయానికి హత్తుకుంది.

"మీ రిజల్ట్సు వచ్చినట్లున్నాయే!"

"ఆఁ!"

"పోయిందా?" ఇలా అడగాలనే అడిగింది.

"లేదు. క్లాసు వచ్చింది."

గుండె గతుక్కుమంది శారదకు. తన హృదయేశ్వరుడు, యింకా లోతుగా పోతే, అర్థనారీశ్వరుడు యిలా తన్ను ఒంటరిగా విడిచి వెళ్ళడమే!

ఇక్కడ కొద్దిగా శారదను గురించి చెప్పటం అనవసరం కాదు.

శారద పదహారణాల నాగరిక యువతి. ఒక ఫాషన్లలోనే కాదు. ప్రతి విషయంలోనూ ఆమె యిరవయ్యో శతాబ్దాన్నీ, పంథొమ్మిది వందల యాభైఒకటో సంవత్సరాన్నీ జ్ఞప్తికి తెస్తూవుంటుంది. ఆమె, ప్రపంచంలో భారతదేశంలోని ఈ కాలపు స్త్రీజాతికి, వాళ్ళ నాగరికతకు ప్రతినిధి.

"పురుషుడితో పాటు స్త్రీకీ కూడా సమానమైన హక్కులు కావాలి. స్త్రీ అబల కాదు. సబల" అని వాదించే విప్లవవాది ఆమె. (ఆదర్శాల కోసం పాటు పడటం విప్లవం అన్న పదానికి అర్థం కాబట్టి యీ రోజుల్లో.)

అందువల్ల తనను నాలుగు సంవత్సరాలుగా పరీక్షకు పోకుండా ఆపిన మూర్తిమీద కోపం కలిగింది. అందులో మూర్తి మొదటి తరగతిలో నెగ్గడం యీ కోపాన్ని ద్విగుణీకృతం చేసింది.

శారద మూర్తితో మాట్లాడటం మానివేసింది. శారదలో కలిగిన యీ అకారణమైన మార్పు మూర్తికి ఆశ్చర్యంతోపాటు, విషాదం కూడా కలిగించింది. ప్రతి హైందవ స్త్రీ భర్త సౌఖ్యమే తన సౌఖ్యంగా భావిస్తుందని, తన భార్యను కూడా వాళ్ళలో జత కట్టడం వల్ల, తన భార్యకు యిలా అకస్మాత్తుగా కలిగిన కోపానికి కారణం తెలుసుకోలేక పోయాడు మూర్తి.

తరవాత నాలుగు నెలల సంగతి. వాళ్ళ వూళ్ళో "ఆంధ్ర రాష్ట్ర మహిళా సభలు" జరుగుతున్నయ్. అనేక ప్రాంతాలనుంచి శారద స్నేహితురాండ్రు వచ్చారు. ప్రొద్దస్తమానం వాళ్ళతోనే గడిపింది ఆ నాలుగు రోజులూ. మరునాడు వెళ్ళిపోతారనగా క్రితం నాడు అందర్నీ భోజనానికి పిలిచింది.

కిళ్ళీల రసంతోపాటు, ప్రతివాళ్ళ బుర్రల్లోనూ కొత్త ఆలోచనలు మెదిలాయి.

"ఏమే! నీ విశారద పూర్తయిందా?"

"నీదో?" ఎదురు ప్రశ్నించింది శారద. ఆ సమాధానాని కనుగుణంగా తాను సమాధానం చెప్పవచ్చునని.

"మూడేళ్ళయింది పూర్తయి."

ఈ సమాధానం శారద హృదయానికి ఒక బాకు పోటులా తగిలింది. తన స్నేహితురాండ్ర భర్తలందరూ యెంతో మంచి వాళ్లుగా కనిపించారు. కాని తన భర్త?

నాలుగు సంవత్సరాలనించీ తాను పరీక్షకు వెడదామంటే పడలేదు. తనయందు యింత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్న భర్తమీద అసహ్యం వేసింది. ఉన్నవీ లేనివీ నాలుగుచెప్పి ఆయన మీద కసి తీర్చుందామనుకున్నది.

"అయినున్నారు. ఆయన చదువేమో, ఆయనేమో తప్ప, యింట్లో పెళ్ళాం బిడ్డలున్నారే, వాళ్ళకేమైనా కావాలా? అనే సంగతులే పట్టవు. నాలుగు సంవత్సరాలనుంచీ వీలు పడకుండా చేశారు."

ఇలా సాగింది సంభాషణ. మొత్తంమీద తన సంభాషణలో మూర్తిని యెన్నిసార్లు దుమ్మెత్తి పోసిందో యెవ్వరూ లెక్కపెట్టలేదు కాని మిగిలినవాళ్లు మాత్రం శారద ఒక్కతే యీ ఇరవయ్యో శతాబ్దంలో "వుండదగ్గది" అనుకున్నారు మనస్సుల్లో. ఈ రోజుల్లోకూడా యిటువంటి పేరుపురుగు వుండటం మానవజాతికి అవమానకరమనే మాట అనడానికికూడా ఆమెకు సిగ్గనిపించలేదు.

ప్రక్కగదిలో కూర్చుని యీ సంభాషణంతా విన్న మూర్తికి అప్పుడు తెలిసింది భార్య తన్నెందుకు ద్వేషిస్తోందో! అతనికి ఆపాద మస్తకం వెర్రెత్తింది. ఆమె నాలుగు సంవత్సరాలనుంచీ పరీక్షకు పోకుండా వుండటానికి కారణం తానా?

మరునాటి వుదయంనుంచీ తానుకూడా ఆమెతో మాట్లాడదలుచుకోలేదు. ఒక వుత్తరం వ్రాసి పంపాడు.

"నిన్న మీ స్నేహితురాండ్రయెదుట అనవసరంగా నన్ను అవమానం చేశావు. నీవు పరీక్షకు పోలేకపోవడానికి నేను బాధ్యుణ్ణి కాదు."

శారద తక్కువ తిన్నదా? మరో అయిదు నిముషాల్లో ప్రత్యుత్తరం వచ్చింది. "ఈన్న మాటంటే వులుకెక్కువట! 'ఆడది పురుషునికి బానిస' అన్న భావం మీజాతిలో పోతేనేగాని దేశం బాగుపడదు. మీ మేనత్తా, మీ తండ్రీ చనిపోవడంవల్ల నేను వెళ్ళలేకపోయాను. తరువాత రెండు సంవత్సరాలు పనిమనిషి మాదిరిగా పని చేయిస్తే యెలా పరీక్షకు పోతానను కున్నారు?"

మరోవుత్తరం మూర్తినుంచి...

"మేనత్తా, నాన్నగారూ చనిపోతే పరీక్షకు వెళ్ళకపోవడం నీ అవివేకం. వాళ్ళు నీ పరీక్ష రోజుల్లో పోవడం నీ దురదృష్టం. నీ దురదృష్టానికి, నీ కర్మఫలానికి నన్ను బాధ్యుణ్ణి చేయడం నీబోటి చదువుకున్న స్త్రీ చేయవలసిన పనిగాదు. నీవు యీపని చేయలేనని యేనాడన్నా అన్నావా? భారతగృహిణి తనకోసం, తన భర్తకోసం, తన కొడుకుకోసం పని చేయలేనని నే నిప్పుడూ తలచలేను. నీవు బానిసవు కాకుండా, స్వేచ్ఛగా వుండదలుచుకుంటే నా అభ్యంతరంలేదు. నమస్తే."

ఈ వుత్తరమే మరునాడు శారద పుట్టింట్లో వుండటానికి కారణమైంది.

దీర్ఘాలోచనలతో, మధ్యమధ్య నిట్టూర్పులతో, కనుబొమ్మల ముడితో యేకాంతంగా వున్న మూర్తిని నాన్నగారి చిన్ననాటి స్నేహితుడు పలకరించాడు ఆప్యాయంగా.

మాటల సందర్భంలో అడిగాడు "అమ్మాయేదోయ్" "లేదు" పరధ్యానంలో తనకు తెలియకుండానే సమాధానంచెప్పాడు మూర్తి.

ముసలివాడికి హుషారు వచ్చింది. అతను చెప్పే ఏ విషయాలేవీ గమనించడంలేదు మూర్తి.

"బాబూ! ఈ ముసలివాడికి పదహారేళ్ళ కూతురు వుంది. ఏదో బీదవాడిని. నన్ను సంతోషపరచడమంటే మీ నాన్నగారికి ఎంతో ఆనందం. తండ్రికి తగ్గ కొడుకువు. కొద్దిగా దయచూడు బాబూ! నీ పుణ్యంవల్ల ఈ ముసలితనంలో నిశ్చితంగా బ్రతుకుతాం."

"చూద్దాంలెండి" మళ్ళీ పరధ్యానంగానే సమాధాన చెప్పాడు.

"తన కూతుర్ని చేసుకోవడానికి మూర్తి యిష్టపడ్డా"డన్న ముసలాయన ప్రచారం శారద చెవులకు సోకింది. భర్తమీది కోపం ఒక్కసారి తగ్గింది. తన తప్పు తెలుసుకుంది. ఆ రాత్రే రెక్కలు కట్టుకొని వాలింది తన గృహానికి.

ఆ రాత్రి ముసలివాడు మూర్తి సంబంధం నిశ్చయం చేసుకుందామని వచ్చాడు.

"ఆదేమిటండీ, నేను చేసుకుంటాననన్నానా? 'నేను బీదవాడిని. దయచూడాలి' అంటే, యేమైనా ధన సహాయమేమో ననుకొని చూద్దాంలే అన్నాను. ఇప్పుడిక్కడ లేక పోయినా నాభార్య బ్రతికివుంది. భార్య బ్రతికి వుండగా మరొక సంబంధానికి నేను ఒప్పుకోవడం అసంభవం."

వరండాలోవుండి యీ మాటలు విన్న శారద పరుగుపరుగున వచ్చి భర్త ఒళ్ళో వాలి పోయింది.

"ఎవరు? శారదా!"

"నన్ను క్షమించండి."

దానికి సమాధానంగా ఒక చిరునవ్వు నవ్వాడు మూర్తి.

ముసలివాడు నిర్ఘాంతపోయి, నిరాశతో, నిష్క్రమించాడు.

భర్త ప్రేమానురాగాలు, కొడుకు బోసినవ్వులూ, శారదను యెప్పుడూ విశారద పరీక్ష మాట యెత్తకుండా చేసినవి.